# జగద్గురువు



## డా. మరుదాడు అహల్యా దేవి

"అమ్మా!వెళ్తున్నా..".అంటూ కన్నయ్య యశోదకు ముద్దు పెట్టాడు.

ఉలిక్కిపడి లేచింది యశోద.



పక్కనే పడుకుని ఉన్న చిన్ని కన్నయ్య కళ్ళు సగం తెరిచి చూసి తల్లి ఉలికిపాటుకు నవ్వుకున్నాడు.

ముస్ముందు జరగబోయేది అదే..

అందుకే ముందుగా అలా కలలో లేదా సంఘటనల రూపంలో అలవాటు చెయ్యాలని కృష్ణుడి ఆలోచన.

తెల్లారింది.

లేచిన దగ్గరనుండి అటూ ఇటూ తిరుగుతున్నాడు.

అది గమనించిన యశోద..

"ఏమైంది. కన్నయ్యా.. దేనికోసం వెదుకుతున్నావు.." అడిగింది.

"ఏమీ లేదులేమ్మా. నీపని చూసుకో..' అంటూ తిరిగి వెదికే పనిలో పడ్డాడు గోపాలుడు.

"ఏంటన్నయ్యా వెదుకుతున్నావు.." లోపలికి వస్తూ అడిగాడు బలరాముడు.

"అబ్బాబ్బా! ఏమిటి అందరూ..మీ పని మీరు చూసుకోండి.. నన్ను పలకరించొద్దు..నా వస్తువు ఎక్కడుందో నాకు తెలుసు..దొరుకుతుంది త్వరలోనే.." అన్నాడు అన్నయ్యకు కన్నుగీటుతూ.

"అమ్మయ్య..దొరికింది..".అంటూ పిల్లనగ్రోవిని రోటి వెనకలనుంచి తీసాడు కన్నయ్య.

"అమ్మయ్య..దీనికోసమా..నువ్వు వెదికేది..కన్నా.." అంటూ యశోద అలసిపోయిన కన్నయ్య ముఖాన్ని ముద్దు పెట్టుకుంది.

ఆతర్వాత రోజు సాయంత్రం ఆరు అయినా గోవిందుడు రాలేదు..

అందరి పిల్లలతో పాటే వెళ్ళాడు గోవులు కాచుకుని వస్తానని.

అన్నం మూటను భుజాన వేసుకుని వెళ్తున్న కన్నయ్య మోము గుర్తొచ్చి దుఃఖము పొంగుకొచ్చింది యశోదకు.

ఇరుగుపొరుగు పిల్లల్ని అడిగింది.

"అప్పుడే బయలుదేరాడు..ఇంకా రాలేదా.." అంటూ ఆ పిల్లలు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేశారు..

రాత్రి పది అవుతుండగా...వచ్చాడు గోపాలుడు.

"కన్నా...వచ్చావా'..అంటూ కావలించుకుని ఏడ్చింది యశోద.

"అమ్మా.. ఏంటమ్మా ఇది..ముందు ముందు నేను ఇంకా దూరంగా.. శాశ్వతంగా దూరం అయ్యే రోజులు రావచ్చు. అప్పడేమి చేస్తావు." అంటూ కాళ్ళు కడుక్కోవడానికి పెరట్లోకి వెళ్ళాడు కన్నయ్య.

"కన్నయ్యా! పొరబాటుగా కూడా అటువంటి మాటలు అనకు.. నీ ఎడబాటు నేను తట్టుకోలేనురా.." అంది కన్నయ్యను చుట్టుకుపోతూ యశోద.

"సరే..తినడానికి ఏమైనా పెడతావా.ప్రేమతో కడుపు నింపేస్తావా..".అన్నాడు చమత్కారంగా కన్నయ్య.

బలరాముడు కూడా సోదరుడితో పాటు భోజనం చేసాడు..

ఆతర్వాత జరిగిన పరిణామాల్లో బలరాముడు, కన్నయ్య మేనమామ రాజ్యానికి బయలుదేరారు.. అంతే.. మళ్ళీ యశోద దగ్గరకు రాలేదు కన్నయ్య..

ఆ పిచ్చితల్లి ఎదురుచూస్తూనే ఉంది.. కన్నయ్యా అంటూ ఉలికిపడుతూనే ఉంది.

చివరకు కన్నయ్య రానేలేదు తల్లి దగ్గరకు. సొంత తల్లి దేవకీ దగ్గరే ఉండిపోయాడు.. పెళ్ళిళ్ళు, బిడ్డలు అంతా ఆ తల్లిదగ్గరే..

ఇలా జరగడానికి కారణం మీకు తెలుసులెండి.. మళ్ళీ నేను చెప్పడమెందుకు.

అంతే...మరి..దేనిపైనా వ్యామోహం పెంచుకోవద్దంటాడు.

అది వస్తువు అయినా బంధాలైనా.. పెంచుకుంటే దుఃఖమే మిగులుతుందని... చెప్పాడు ఆ జగద్గురువు గీతాచార్యుడు.

**సమాప్తం**

